నమస్తే తెలంగాణ

ఆదిలాబాద్ - నిర్మల్

5 నిజామాబాద్ శనివారం 30 నవంబర్ 2024 ADILABAD NIRMAL




తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

# కేసీఆర్ పోరాట ఫలితమే తెలంగాణ

## సబ్బండ వర్గాలను ఏకం చేసేందుకే నాడు కేసీఆర్ దీక్ష

- ఆంధ్రా పాలకుల కుట్రలకు ఎదురొడ్డిన ధీరుడు కేసీఆర్
- రాష్ట్రంలో మళ్లీ వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే
- కార్యకర్తలంతా సైనికుల్లా పోరాడాలి
- దీక్షా దివస్‌లో నిర్మల్ జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి



దీక్షా దివస్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి



కేసీఆర్ చిత్ర పటం, అమరవీరుల స్తూపానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

నిర్మల్, నవంబర్ 29(నమస్తే తెలంగాణ): 'తెలంగాణను మేమే ఇచ్చామంటూ కొన్ని పార్టీలు ప్రగల్భాలు పలుకుతున్నాయి. మరి గాంధీజీ కూడా దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడారు. స్వాతంత్ర్యం గాంధీజీ తెచ్చారంటారా..? లేదా బ్రిటీష్ వారు ఇచ్చారంటారా..? దీనిపై కాంగ్రెస్ నాయకుల సమాధానం చెప్పాలి' అని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి ప్రశ్నించారు. 2001 నుంచి 2014 వరకు 13 ఏళ్ల సుధీర్ఘ కాలం పాటు కేసీఆర్ చేసిన పోరాటాలు, త్యాగాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం సాధ్యమైందని స్పష్టం చేశారు. శుక్రవారం నిర్మల్ జిల్లా కేంద్రం లోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో దీక్షా దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నిర్మల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ సమన్వయకర్త కొరిపెల్లి రాంకిషన్‌రెడ్డి అధ్యక్షత వహించగా ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా కార్యాలయ ప్రాంగణంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూల మాలలు వేశారు. అనంతరం బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ చిత్రపటంతో పాటు అమరవీరుల స్తూపానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా దీక్షా దివస్‌లో ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డి మాట్లాడారు. 2001లో టీడీపీ నుంచి బయటకు




సభా ప్రాంగణంలో ఉద్యమ చరిత్ర డాక్యుమెంటరీని చూస్తున్న పార్టీ కార్యకర్తలు

వచ్చిన కేసీఆర్ టీఆర్‌ఎస్ పార్టీని స్థాపించారన్నారు. ప్రజా స్వామ్య పద్ధతిలోనే తెలంగాణ సాధించాలన్న లక్ష్యంతో నాటి నుంచి అన్ని ఎన్నికల్లో పార్టీ తరపున అభ్యర్థులను బరిలో నిలిపి విజయాలను సాధిస్తూ వచ్చారని తెలిపారు. ఇదే సమయంలో గ్రామ గ్రామానా స్వరాష్ట్ర సాధన ఆవశ్యకతపై ప్రజలను చైతన్యం చేశారన్నారు. రాష్ట్ర ఏర్పాటు ఆలస్యమవుతున్నదన్న క్రమంలో సరిగ్గా ఇదే రోజు 'కేసీఆర్ చచ్చుడో తెలంగాణ వచ్చుడో' అనే నినాదంతోనే 2009 నవంబర్ 29న కేసీఆర్ సబ్బండ వర్గాలను ఏకతాటిపైకి తెచ్చి కేంద్రం మెడలు వంచేందుకు దీక్ష చేపట్టారని గుర్తు చేశారు. నాటి పాలకులు అక్రమంగా జైలులో వేసినా దీక్ష విరమించలేదన్నారు. 10 రోజుల పాటు కొనసాగిన దీక్షతో కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి విషమించిందని, తెలంగాణ ప్రజలంతా రోడ్లపైకి వచ్చి నిరసనలను హోరెత్తించారని నాటి సంఘటనలను గుర్తు చేశారు. కేసీఆర్ దీక్షతో దిగివచ్చిన నాటి యూపీఏ ప్రభుత్వం డిసెంబర్ 9న రాత్రి 10 గంటలకు తెలంగాణ ఏర్పాటుకు కట్టుబడి ఉన్నామని ప్రకటించిందన్నారు. రాష్ట్ర ఏర్పాటును అడ్డుకునేందుకు ఆంధ్రా పాలకులు కుట్రలు చేశారని మరో నాలుగేళ్ల పాటు కమిటీల పేరుతో కాలయాపన చేశారన్నారు. చివరికి జనవరి 30, 2014న ఢిల్లీ వెళ్లి మళ్లీ తెలంగాణ రాష్ట్రంలోనే అడుగు పెడతానని శపథం చేసిన కేసీఆర్ ఢిల్లీ మెడలు వంచి పార్లమెంటులో తెలంగాణ బిల్లు ఆమోదం పొందేలా చేశారని తెలిపారు. ఇంత గొప్ప నాయకుడి త్యాగాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైందన్నారు. కేసీఆర్ నాయకత్వంలోనే తెలంగాణకు శ్రీరామ రక్ష అన్నారు. గత 10 ఏళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ బిల్లు ద్వారా న్యాయంగా రావాల్సిన కేంద్రం నిధులను బీజేపీ ప్రభుత్వం ఇవ్వకుండా మొండిచేయి చూపిందని ఆరోపించారు. జాతీయ పార్టీలను నమ్మి మోసపోవద్దని గత అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కేసీఆర్ పదేపదే చెప్పాని, అయినా ప్రజలు నమ్మి కాంగ్రెస్ అధికారమిస్తే గత 11 నెలల కాలంలో ఆ పార్టీ ప్రభుత్వ పనితీరు ఏవిధంగా ఉన్నదో రాష్ట్ర ప్రజలకు తెలిసిపోయిందన్నారు. మళ్లీ రాబోయేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని, ఇందుకోసం ప్రతి కార్యకర్త కేసీఆర్ సైనికుడిగా మారాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత కాంగ్రెస్ నాయకులు తెలంగాణ రాష్ట్రంలో పదవులు అనుభవిస్తున్నారంటే దానికి కారణం నాడు కేసీఆర్ చేపట్టిన దీక్షా ఫలితమేనని అన్నారు. అనంతరం దిలావర్‌పూర్ గ్రామానికి చెందిన షేఖ్ హరుణ్ కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్‌ఎస్‌లో చేరడంతో ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. సమావేశంలో ముందుగా జడ్పీ మాజీ కో-ఆప్షన్ సభ్యులు డాక్టర్ సుభాష్‌రావు తెలంగాణ చరిత్రపై సవివరంగా తెలియజేయడంతో పార్టీ కార్యకర్తలు ఆసక్తిగా విన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్‌పర్సన్ కొరిపెల్లి విజయ లక్ష్మి, నిర్మల్ నియోజకవర్గ సమన్వయకర్త రాంకిషన్‌రెడ్డి, ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భుక్యా జాన్సన్ నాయక్, ముథోల్ నియోజకవర్గ పార్టీ సమన్వయకర్తలు పడకంటి రమాదేవి, లోలం శ్యాం సుందర్, కిరణ్ కొమ్రేవార్, విలాస్ గాదేవార్ పార్టీ నిర్మల్ పట్టణాధ్యక్షుడు మారుగొండ రాము, దిలావర్‌పూర్ మాజీ ఎంపీపీ ఎలాల చిన్నారెడ్డి, జాగృతి జిల్లా అధ్యక్షుడు తుమ్మనపెల్లి లక్ష్మణాచారి, నాయకులు భూషణ్‌రెడ్డి, నజీరొద్దీన్, నేళ్ల అనీల్, ఆకాష్, ఆదుముల్ల విశాల్, ఖానాపూర్‌కు చెందిన పార్టీ నాయకులు పెందూర్ పుష్పలత, జైవంత్‌రావు, చంద్రశేఖర్, రాజారాంరెడ్డి, తాళ్లపెల్లి రాజ్‌గంగన్న, సక్కారాం శ్రీనివాస్, రాజు, గోవింద్, ఐలయ్య, కల్వకుంట్ల నారాయణ, అబ్దుల్ కలీల్, కొక్కుల ప్రదీప్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



దీక్షా దివస్ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా తరలి వచ్చిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు



బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



మాట్లాడుతున్న దీక్షా దివస్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ గంగాధర్ గౌడ్

# కేసీఆర్ తెలంగాణ తేకుంటే రేవంత్ సీఎం అయ్యేటోడా?

## బీఆర్‌ఎస్ అధినేత ఉద్యమ ఫలితమే తెలంగాణ

- కాంగ్రెస్‌ది అవగాహనా రాహిత్య పాలన
- దీక్షా దివస్‌లో మాజీ ఎమ్మెల్సీ గంగాధర్ గౌడ్
- ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ నెరవేర్చాలి
- మాజీ మంత్రి జోగురామన్న

ఆదిలాబాద్, నవంబర్ 29 ( నమస్తే తెలంగాణ) : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై ప్రశ్నిస్తూ ప్రత్యేక రాష్ట్ర సాధనే లక్ష్యంగా 2001లో బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తన పదవులకు రాజీనామా చేసి పోరాడారని, ఆయన తెలంగాణ తేకుంటే రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యేటోడా ? అని ఆదిలాబాద్‌లో చేపట్టిన దీక్షా దివస్‌లో ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ గంగాధర్ గౌడ్ ప్రశ్నించారు. శుక్రవారం ఆదిలాబాద్ బీఆర్‌ఎస్ కార్యాలయం ఆవరణలో దీక్షా దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరవీరులకు నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు. తెలంగాణ తల్లి విగ్రహం, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేశారు. 'జై తెలంగాణ' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ గంగాధర్ గౌడ్ మాట్లాడుతూ 14 సంవత్సరాల పాటు కేసీఆర్ అనేక ఉద్యమాలు చేపట్టి తెలంగాణ సాధించారని తెలిపారు. కేంద్ర



ఫోటో ప్రదర్శనను తిలకిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మాజీ మంత్రి చిదంబరం తెలంగాణ ప్రకటనను వెనక్కి తీసుకోవడం వల్ల వందలాది మంది ప్రత్యేక రాష్ట్రం కోసం ఆత్మహత్యలు చేసుకున్నారని గుర్తు చేశారు. కేసీఆర్ ఉద్యమ పోరాట ఫలితంగా అప్పటి కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి తెలంగాణ ఇచ్చిందని తెలిపారు. కేసీఆర్ తెలంగాణ తీసుకురాకపోతే రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యేటోడా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులకు అభివృద్ధి, ప్రజా సంక్షేమంపై పట్టింపులేదని, ముఖ్యమంత్రి, మంత్రుల ప్రకటనలకు రోజురోజుకూ పొంతన లేకుండా పోతుతున్నదన్నారు. రాష్ట్రంలో అవగాహనా రాహిత్య పాలన కొనసాగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో విఫలమైందని పేర్కొన్నారు. మహారాష్ట్ర ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు ఎక్కువగా ఉన్న 11 నియోజకవర్గాల్లో ప్రచారం చేసినా ఒక్క దాంట్లో కూడా కాంగ్రెస్ గెలవలేదని, ఆరు గ్యారెంటీల విషయంలో మోసం చేసినందుకు అక్కడి ప్రజలు తగిన బుద్ధి చెప్పారని ఎద్దేవా చేశారు.



హాజరైన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు

### బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

- మాజీ మంత్రి జోగు రామన్న

బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాత ఎన్నికలు నిర్వహించాలని మాజీ మంత్రి జోగు రామన్న డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబ సమగ్ర సర్వే తర్వాత రిజర్వేషన్లు అమలు చేస్తామని ఇచ్చిన హామీకి కట్టుబడి ఉండాలన్నారు. చంద్రబాబు రెండు కళ్ల సిద్ధాంతానికి నిరసనగా తాను 2011లో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నట్లు ఈ సందర్భంగా గుర్తు చేశారు. సోనియా గాంధీని బలిదేవత అన్న రేవంత్ రెడ్డి ఇప్పుడు తెలంగాణ ఇచ్చిన తల్లి అంటున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా, రుణ మాఫీ అమలు చేయకుండా మహబూబ్‌నగర్‌లో రైతు విజయోత్సవ సభ ఎందుకు నిర్వహిస్తున్నదో కాంగ్రెస్ నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 10 సంవత్సరాల రాష్ట్రాన్ని బీఆర్‌ఎస్ భష్టు పట్టించిందని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అంటున్నారని, బీఆర్‌ఎస్‌లో ఉండి 5 సంవత్సరా లు మంత్రిగా ఉన్న ఆయన సిగ్గులేకుండా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల, ప్రజా సమస్యల పరిష్కారానికి బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పోరాడుతూనే ఉంటారని తెలిపారు.

### డిగ్రీ చదువుతున్నప్పుడే ఉద్యమంలో చేరినా..

- అనిల్‌జాదవ్, ఎమ్మెల్యే, బోథ్



తాను 2001లో నిర్మల్‌లో డిగ్రీ చదివే రోజుల్లో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ నిర్వహించిన బహిరంగసభకు హాజరై ఉద్యమంలో చేరినట్లు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తెలిపారు. 2002లో రాష్ట్రంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలు జరిగాయని, బోథ్ నియోజకవర్గంలో కారుపై గులాబీ జెండా పెట్టిన మొదటి నాయకుడిని తానే అని తెలిపారు. ఆ ఎన్నికల్లో విస్తృతంగా ప్రచారం చేయడంతోనే నేరడిగొండ జడ్పీటీసీ, ఎంపీపీతో పాటు గుడిహత్నూర్ జడ్పీటీసీ స్థానాలను బీఆర్‌ఎస్ గెలుచుకుందన్నారు. ఇటీవల మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసినప్పుడు చింతల్‌బోరి ప్రాజెక్టును గుర్తు చేశారని తెలిపారు. రాష్ట్రంలో ప్రతి గ్రామంపై అవగాహన ఉన్న నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. ఆయన గురించి కాంగ్రెస్ నాయకులు అవాక్కులు, చెవాక్కులు మాట్లాడడం సరికాదని తెలిపారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలకు మంచి భవిష్యత్ ఉందని, ప్రజల మధ్యలో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ దీక్షా దివస్ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, మాజీ జడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, నాయకులు రౌత్ మనోహర్, చారులత, కృష్ణారెడ్డి, తుల శ్రీనివాస్, యూనిస్ అక్బానీ, యాసం నర్సింగరావు, విజ్జిగిరి నారాయణ, దాసరి రమేశ్, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### బలిదానాల పాపం కాంగ్రెస్‌దే..

-బీఆర్‌ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్



తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం జరిగిన ఉద్యమంలో విద్యార్థులతో పాటు ఎందరో ఉద్యమకారులు అమరులయ్యారని, వారి బలిదానాల పాపం ముమ్మాటికీ కాంగ్రెస్ పార్టీదేనని బీఆర్‌ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ అన్నారు. నాడు కేసీఆర్ చేపట్టిన ఆమరణ దీక్షకు దిగివచ్చిన కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం.. డిసెంబర్ 9, 2010న తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించిందన్నారు. ఆంధ్రా నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గిన అప్పటి కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ఏర్పాటు విషయంలో కాలయాపన చేస్తూ వచ్చిందన్నారు. ఇక తెలంగాణ రాదేమోనని వందలాది మంది తెలంగాణ వాదులు, ఉద్యమకారులు ఆత్మ బలిదానాలు చేసుకున్నారని గుర్తు చేశారు. నాలుగేళ్ల ముందే రాష్ట్రాన్ని ఇచ్చి ఉంటే ఇవి జరగకపోయి ఉండేవన్నారు. ఇప్పుడు అదే కాంగ్రెస్ పార్టీ తెలంగాణను మేమే ఇచ్చామని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. తెలంగాణ అంటే కేసీఆర్.. కేసీఆర్ అంటే తెలంగాణ.. అని.. కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేయడం కాంగ్రెస్ తరం కాదని ఎద్దేవా చేశారు.

### కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత

బీఆర్‌ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయకర్త లోలం శ్యాంసుందర్



కేసీఆర్ హయాంలో పదేళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా రాష్ట్రం ఎంతో అభివృద్ధి సాధించిందని బీఆర్‌ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయకర్త లోలం శ్యాంసుందర్ అన్నారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం అందజేసిన ప్రశంసలు, అవార్డులే నిదర్శనమన్నారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పాలకులు ఆచరణ సాధ్యం కాని అనేక 420 హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన సంగతి తెలిసిందేనన్నారు. ప్రస్తుతం ఏ ఒక్క హామీని అమలు చేయకపోవడంతో కేవలం 11 నెలల కాలంలోనే ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత వస్తున్నదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించి సత్తా చాటాలని కార్యకర్తలకు సూచించారు.

# నిర్మల్‌లో ఏసీబీ దాడులు

## రూ.10 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ల్యాండ్ అండ్ సర్వే కార్యాలయ జూనియర్ అసిస్టెంట్, అటెండర్

నిర్మల్ అర్బన్, నవంబర్ 29 : జిల్లాలో ఇటీవల నిర్మల్ మున్సిపల్ కార్యాలయ ఉద్యోగి శాఖీర్ ఖాన్ ఏసీబీకి పట్టుబడిన విషయం మరువక ముందే తాజాగా శుక్రవారం ల్యాండ్ అండ్ సర్వే కార్యాలయంలో మరో ఉద్యోగి పట్టుబడ్డాడు. నిర్మల్ పట్టణంలోని బుధవార్‌పేట్ కాలనీకి చెందిన సల్ల హరీశ్ సేత్వార్ పని కోసం ఈ నెల 5న నిర్మల్ జిల్లా కలెక్టరేట్‌లోని ల్యాండ్ అండ్ సర్వే కార్యాలయానికి వెళ్లాడు. తన పని చేయాలని కోరగా రూ.20 వేల లంచాన్ని జూనియర్ అసిస్టెంట్ జగదీశ్ డిమాండ్ చేశాడు. అంత డబ్బు ఇచ్చుకోలేనని సూచించగా రూ.10 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ విషయంపై ఏసీబీ అధికారులను బాధితుడు ఆశ్రయించాడు. దీంతో శుక్రవారం కార్యాలయంలో డబ్బులు తీసుకుంటుండగా జూనియర్ అసిస్టెంట్



పట్టుబడ్డ జూనియర్ అసిస్టెంట్, అటెండర్

జగదీశ్, అటెండర్ ప్రశాంత్ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. కేసు నమోదు చేసి వీరిని అరెస్ట్ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపీ మిడియం బాబురావు

## పులుల నుంచి రక్షణ కల్పించడంలో అధికారులు విఫలం

ఎదులాపురం,నవంబర్ 29 : పులుల దాడుల నుంచి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజలను కాపాడడంలో అటవీ శాఖ అధికారులు విఫలమవుతున్నారని మాజీ ఎంపీ, టీఏజీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిడియం బాబురావు అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్‌లో సుందరయ్య భవనంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే పులి దాడిలో ముగ్గురు, ఏనుగు దాడిలో ఇద్దరు మరణించినా ప్రజల రక్షణను అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. శుక్రవారం కాగజ్‌నగర్ మండలంలో పులి దాడిలో మరణించిన మొర్లె లక్ష్మి కుటుంబానికి నష్టపరిహారంతో పాటు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు, 5 ఎకరాల సాగు భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు.